క్లుప్తంగా

బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి సత్కారం


రాజ్యలక్ష్మిని అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు

శ్రీశైలంప్రాజెక్ట్: ఈ నెల10 నుంచి 14వ తేదీ వరకు పాటాన్లో జరిగిన 68వ బాలబాలికల క్రీడోత్సవాలలో ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రతిభ కనబరచిన సున్నిపెంటకు చెందిన వై.రాజ్యలక్ష్మిని మండల బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు దగ్గుబాటి మల్లేశ్వరప్రసాద్ ఆదివారం అభినందించారు. జాతీయ 68వ జూనియర్ బాలబాలికల క్రీడలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్ర రాష్ట్రానికి తన టీంతో కలసి రెండో స్థానాన్ని తీసుకువచ్చింది. బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అందించిన మెడల్, సర్టిఫికెట్‌తో సున్నిపెంటకు చేరుకున్న రాజ్యలక్ష్మిని ఆదివారం అసోసియేషన్ సత్కరించింది.

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దాత రామలింగేశ్వరరెడ్డికి రశీదు ఇస్తున్న కమిటీ సభ్యులు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో శివాలయం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి రూ.లక్ష విరాళం శివాలయం నిర్మాణ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ దైవ కార్యాలకు ఎంత ఇచ్చినా తక్కువేనన్నారు. ప్రతి ఒక్కరూ దైవ కార్యాలకు తమ వంతు సహకారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో శివాలయం నిర్మాణ కమిటీ సభ్యులు బుడ్డన్నగౌడు, లక్ష్మణ్ గౌడు, రాజు, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు నాలుగు సెంటర్లు

మహానంది: పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మహానంది మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాల, తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్, గాజులపల్లె క్రీస్తుజ్యోతి స్కూల్, గాజులపల్లె జిల్లా పరిషత్ పాఠశాల నాలుగు పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. నాలుగు కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేటు కలిపి మొత్తం 785 మంది పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతించం

జూపాడుబంగ్లా: పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షాకేంద్రంలోకి అనుమతించబోమని ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 593మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

మహానందీశ్వరుడికి అభిషేకార్చనలు


స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్ల మూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం పూజలు వైభవంగా చేపట్టారు. సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారితో పాటు కోదండరాముడు, వినాయకనందీశ్వరస్వామి, గరుడనందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

ఫొటోలు తొలగించాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాలల సమీపంలో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని డీఈఓ సుధాకర్ రెడ్డి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నంద్యాల జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాఠశాలలో అమలు అవుతున్న వివిధ పథకాలకు సంబంధించిన, రాజకీయ నాయకుల ఫొటోలను వెంటనే తీసేయాలని చెప్పారు. అలాగే పాఠశాలకు 100 మీటర్లలోపు ఫ్లెక్సీలు, ఫొటోలు ఉంటే పంచాయతీ సెక్రటరీకి తెలియజేసి తొలగించి ధ్రువీకరణ పత్రాలను సంబంధిత అధికారుల ద్వారా విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

ఊరూరా 'ఉపాధి'

- ముమ్మరంగా ఉపాధి హామీ పనులు
- లక్ష్యానికి మించి పనుల కల్పన
- రోజు వెయ్యి మందికి పైగా కూలీల హాజరు
- వలసల నివారణకు తోడ్పాటు


గువ్వలకుంట్ల చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కొత్తపల్లి: గ్రామాలలో ప్రజలకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం ద్వారా అధికారులు పనులు కల్పిస్తున్నారు. వెయ్యికి పైగా కూలీలు మండలంలోని ఆయా గ్రామాలలో ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఊరూర ఉపాధి దొరుకుతుండటంతో ప్రజలకు వలస వెళ్లే అవస్థలు తప్పాయి.

అవినీతికి తావులేకుండా..

వేసవి సమయంలో ప్రజలు వలసలు వెళ్లకుండా గ్రామాలలోనే జీవనోపాధి మెరుగుపరిచే విధంగా ఉపాధిహామీ పనులు జరుగుతున్నాయి. దీనికితోడుగా పనుల్లో ఎటువంటి అవినీతికి చోటులేకుండా చేసేందుకు ఎన్‌ఎంఎంఎస్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా పనులు చేస్తున్న సమయంలో ఉదయం ఒక ఫొటో.. నాలుగు గంటల సమయం తర్వాత రెండో ఫొటో తీయడం ద్వారా అవినీతికి చోటులేకుండా పనులు కల్పించేందుకు తోడ్పాటునిస్తుంది.

5,922 కుటుంబాలకు పని

మండలంలో 7285 జాబుకార్డులకు 14,258 మంది పనులు చేసుకునేందుకు వీలుంది. ఇందులో ప్రస్తుతం 5,922 కుటుంబాలకు ఈ పనుల ద్వారా జీవనోపాధి కల్పిస్తున్నారు. సుమారు 10,673 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరానికి 2,47,948 పనిదినాలు కల్పించాల్సి ఉండగా 2,86,542 పనిదినాలు కల్పించి 116 శాతం పనులు అధికారులు పూర్తిచేయించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి 3,44,000 పనిదినాలను కల్పించాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చింది. ఇందులో మార్చి నెలకు 3,03,000 పనిదినాలు కల్పించి 88 శాతం పనులు ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. కూలీలకు రోజువారీ వేతనం రూ.272 వచ్చే విధంగా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా కొలతలు ఇచ్చి పనులు కల్పిస్తున్నారు. ప్రతి రోజూ మండలంలో 1,420 మందికి పని కల్పించాల్సి ఉండగా వెయ్యి మందికి పైగా కూలీలు హాజరవుతున్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు

పనిప్రదేశంలో కూలీలకు నీడకోసం పట్టలు, ఏమైన ప్రమాదం సంభవిస్తే అక్కడే ప్రథమ చికిత్స అందించేలా ప్రథమ చికిత్స కిట్లను అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. మండలంలో 100 రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు 371,81 నుంచి 99 రోజులు ఉపాధి పనిదినాలు పూర్తిచేసుకున్న కుటుంబాలు 981 ఉన్నాయి. ఉపాధి పనులతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు.


బండినాయుని పాలెం సమీపంలోని పంట కాల్వలో చేసిన పనులను కొలతలు తీస్తున్న దృశ్యం

ఉన్న ఊరిలోనే పని కల్పించడం బాగుంది



ఎక్కడికీ వెళ్లకుండా మాగ్రామంలోనే ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడం చాలా బాగుంది. ఈ పనిలేకుండా ఉంటే మేము ఊరువదిలి వలసలు వెళ్లేవాళ్లం. 100 రోజులు పని కల్పించడం ద్వారా వలసలు వెళ్లకుండా ఊర్లోనే ఉంటూ పనులు చేసుకుంటున్నాం.

– కిరణ్‌కుమార్ గువ్వలకుంట్ల

అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం



మండలంలో 12 గ్రామపంచాయతీలలో 32 గ్రామాలు ఉన్నాయి. వందల కుటుంబాలు ప్రతి రోజు పనులకు హాజరవుతున్నాయి. అడిగిన ప్రతి వారికి వెంటనే పనులు కల్పిస్తున్నాం. మండలంలో ఎవరూ వేరే చోటికి పనులకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి కల్పిస్తున్నాం.

– ఏపీఓ రేష్మ, కొత్తపల్లి

విధుల్లో అలసత్వం వద్దు

మహానంది: ఎన్నికల వేళ విధుల్లో అసలత్వం వహించకుండా, ఎన్నికల నియమావళి అనుసరించి విధులు పకడ్బందీగా చేపట్టాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్, ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎక్కడా రాజకీయపార్టీలకు సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లు లేకుండా చూడాలని, విగ్రహాలు ఉంటే వాటిని కవర్లతో కప్పేయాలన్నారు. ఎలాంటి గుర్తులు, చిత్రాలు ఉంచరాదన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో పర్యటించి రాజకీయ పార్టీల బ్యానర్లను తొలగించారు.

విద్యార్థి బస్సు ఎర్రమఠం వరకు నడపాలి

కొత్తపల్లి: మండలంలోని గుమ్మడాపురం గ్రామం వరకు వస్తున్న విద్యార్థి బస్సును ఎర్రమఠం గ్రామం వరకు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే.దినేష్ కుమార్ కోరారు. ఆదివారం ఆత్మకూరు ఆర్టీసీ డిపో కంట్రోల్ సీఐ షఫీవుల్లాకి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ఒంటిపూట పాఠశాలలు ఉండడంతో మండలంలోని ఎర్రమఠం విద్యార్థులకు విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మధ్యాహ్నం సమయంలో ఎర్రమఠం విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోతే ఇబ్బందులకు గురి కావలసిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు


మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి


హాజరైన తొగట వీరక్షత్రీయులు

- దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాలు అమలు చేసిన ఏకైక సీఎం జగనన్న
- చంద్రబాబు నాయకులు, కార్యకర్తలకు దోచిపెట్టారు
- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: విద్యలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఏకైక రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీఆర్ గార్డెన్‌లో తొగట వీరక్షత్రీయ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ హాజరయ్యారు. ముందుగా శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యలో రాణించాలనే ఉద్దేశంతో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అమ్మ ఒడి పథకం అమలు చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రతి పేద పిల్లవాడు బడిలో ఉండాలనే సంకల్పంతో రూ. 15 వేలు తల్లుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా నవరత్నాల కింద సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు నాయుడు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల బ్యాంక్ ఖాతాలోకి ప్రజల సొమ్మును వేశారని, టీడీపీ వెంట ఉన్న బీసీలను మోసం చేశారని గుర్తు చేశారు.

కుటుంబ సభ్యుడిగా ఆదరించండి

మీ కుటుంబ సభ్యుడిగా ఆదరించి మంచి మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీల పక్షపాతిగా నిలిచారని, బీసీలకు పెద్ద పీట వేశారని చెప్పారు. గడప గడపకూ వచ్చి మీ సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. మీ కుటుంబ సభ్యుడిగా గుర్తించి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చింత లక్ష్మిదేవి, దేశెట్టి సుమలత, శ్రీచౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు చింత రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు మేకల రామచంద్రుడు, సెక్రటరీ వీరనాల ప్రసాద్, కోశాధికారి పాణ్యం నాగరాజు, సభ్యులు శ్రీరాములు, చింత శ్రీను, మాయకుంట్ల కృష్ణ, విజయభాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ట్ శ్రీను, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు


వేదపండితుల ఆశీస్సులు అందుకుంటున్న రిటైర్డ్ కమిషనర్ సుందర్‌కుమార్

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆదివారం రాత్రి పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ రిటైర్డ్ కమిషనర్ సుందర్‌కుమార్, కుటుంబ సభ్యులు మహానందికి వచ్చారు. ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు వారికి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. వారితో పాటు కర్నూలు అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.శ్రీనివాసకుమార్ దంపతులు పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతు శర్మ, శాంతారాంభట్‌లు వారికి వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా


శిల్పా కార్తీక్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వెలువడినందున పార్టీ కార్యకర్తలు చురుకుగా ప్రచారంలో పాల్గొనాలని, ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆత్మకూరు, శ్రీశైలం, బండి ఆత్మకూరు, మహానంది, వెలుగోడు మండలాలు అభివృద్ధి సాధించాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, విజయ్‌చౌదరి, విజయ్, సుల్తాన్, అహ్మద్‌రసూల్, నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఏఏను వ్యతిరేకించాలి

నంద్యాల(న్యూటౌన్): సీఏఏను వ్యతిరేకించాలని కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రోజాకుంటలోని అబ్దుల్లా షాదీఖానాలో సదస్సు నిర్వహించారు. అవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిష్టీ, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతలయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి ఎం.శంకర్ పాల్గొన్నారు. వారు సీఏఏను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు.


అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ దారా సుధీర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నందికొట్కూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలకే అందజేశారని చెప్పారు. నామినేటెడ్ పదవులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ పదవులు 50 శాతం మహిళలకే కేటాయించిన చరిత్ర సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని గుర్తు చేశారు. మున్సిపాలిటీలో 29 వార్డులు ఉంటే 15 వార్డులు మహిళలకు కేటాయించి గెలుపించుకోవడం జరిగిందని చెప్పారు. ఇళ్ల స్థలాలతో పాటు అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరుతో ఇస్తూ.. బటన్ నొక్కి వారి బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేశారని గుర్తు చేశారు.

మహిళలకు పెద్ద పీట

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు పెద్ద పీట వేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. మహిళలు స్వయం కృషితో రాణించాలన్నారు. అనంతరం కోలాటం లీడర్ మంజులరాణిని మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలరు రూపాదేవి, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ఈపూరి నాగకుమారి, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, సభ్యురాలు వసుధ, శశి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి


మామిడి తోటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: జిల్లాలో మామిడి రైతులను ఆదుకోవాలని, దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, రైతు సంఘం నాయకులు మహబూబ్ బాషా, రణధీర్, వీరన్న కోరారు. పట్టణ సమీపంలో దెబ్బతిన్న మామిడి తోటలను ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ఆత్మకూరు, కొత్తపల్లి, గడివేముల, బేతంచెర్ల, బనగానపల్లె, మహానంది మండలాల్లో వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరం సరైన వర్షాలు లేకపోవడంతో పాటు మామిడి తోటలకు నల్లతామర పురుగు ఆశించడంతో 90శాతం పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ ఏడాది జనవరిలో రెండోసారి పూత కూడా నిలబడక పిందెలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న మామిడి రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం చెల్లించాలని కోరారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


నెహ్రూనగర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని యర్రగూడూరు, బానుముక్కల, బానకచెర్ల గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో వర్గ విభేదాలకు తావివ్వరాదన్నారు. సమస్యాత్మక గ్రామాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటికే కేసుల్లో ఉన్న వారు ఏ మాత్రం గొడవలకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు

మహానంది: ఎన్నికల వేళ గ్రామాల్లో గొడవలు సృష్టించడం, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. బుక్కాపురం, తిమ్మాపురం గ్రామాల్లో ఆదివారం స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు.

పగిడ్యాల: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పడమర ప్రాతకోట గ్రామాల్లో ఆదివారం నందికొట్కూరు రూరల్ సీఐ ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ (కేంద్ర బలగాలు) సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఐ వెంట ముచ్చుమర్రి, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐలు జయశేఖర్, నాగార్జున, ఆయా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


గ్రామసచివాలయంలో పోస్టర్లను తొలగిస్తున్న దృశ్యం


విగ్రహాలకు ముసుగులు వేసి.శిలాఫలకాలకు పేపర్లు అతికిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ఎవరైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని మోడల్ కోడ్‌ఆఫ్ కండక్టు అధికారిణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని కేజీ రోడ్డు, పురవీధుల్లో ఏర్పాటు చేసిన వివిధ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లను తీసివేయించారు. గ్రామసచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలను తొలగింపజేశారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలను బట్టలతో కప్పివేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎవరైనా పార్టీల జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటుచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, చిత్రపటాలను తొలగింపజేసినట్లు తెలిపారు. పార్టీల నాయకులు వారి ఇళ్లపైన కూడా పార్టీల జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు పెట్టుకోవడానికి అనుమతుల్లేవన్నారు. అలా ఏ పార్టీల నాయకులైనా ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకొని ఉంటే వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు.

ఫ్లెక్సీల తొలగింపు

పగిడ్యాల: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఆదివారం ఆయా పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా ఫ్లెక్సీలను తొలగించడం విశేషం. ఎక్కడైనా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు కనిపిస్తే కోడ్ ఉల్లంఘన కింద బాధ్యులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ హెచ్చరికలు జారీ చేశారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ జరిగే వరకు ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించాలని సూచించారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఎం.శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఆదివారం శ్రీశైలం మండలంలో ఎలక్షన్ మోడల్ కండక్ట్‌కోడ్ టీం సభ్యులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లను తొలగించారు. అక్కడక్కడ ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించారు. ఏ రాజకీయ పార్టీవారైనా ఎన్నికల నియమావళిని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంసీసీ టీం సభ్యులు తహసీల్దార్ గురప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శ్రీనివాసులు, వీఆర్‌ఓ నాగచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్యకు చెక్


బోరు మోటారు నుంచి నీరు వస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్న పారుమంచాల వాసులు

జూపాడుబంగ్లా: పారుమంచాల, తర్తూరు గ్రామాల్లో తాగునీటి ఎద్దడికి జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి చెక్‌పెట్టారు. నూతన బోర్లు తవ్వించి మోటార్లను అమర్చడంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. పారుమంచాల గ్రామంలోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్ కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి వారం క్రితం నూతన బోరును తవ్వించి ఆదివారం నూతన మోటారును అమర్చి నీటిపంపింగ్ ప్రారంభించారు. ఆ కాలనీలో నీటిసమస్య తీరడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తర్తూరు గ్రామంలో నూతన బోరును తవ్వించి ట్యాంకుకు అనుసంధానం చేయటంతో గ్రామంలో పూర్తి స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కారం కానుందని సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పోచా హేమశేఖర్‌రెడ్డి, పోచా లోకేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, కె.భరత్‌రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, మహేష్‌నాయుడు, రాము, జాకీర్‌బాషా, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం


కొత్తపల్లి పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో గోకవరం, కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో 370 మంది పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీం, రఘుస్వామి తెలిపారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

పాములపాడు: మండల కేంద్రంలో 10 వతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ బాలాజీనాయక్ ఆదివారం తెలిపారు. పరీక్షల అధికారులతో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 272, ఏపీ మోడల్‌స్కూలులో 238 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు.

పగిడ్యాల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి సుభాన్ తెలిపారు. ఆదివారం మండలంలోని లక్ష్మాపురం, పాత ముచ్చుమర్రి, పగిడ్యాల పరీక్షా కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు సరిపడా టేబుల్స్ ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న 4 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయం నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈఓ వెల్లడించారు. ఈ ఏడాది మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మాస్ కాపీయింగ్‌కు చోటు లేకుండా పరీక్షలు

మిడుతూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓలు రామిరెడ్డి, శ్రీనాథ్ తెలిపారు. మండలపరిధిలోని పదో తరగతి పరీక్షల నిర్వహణకు ముడు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. పరీక్షాకేంద్రాలలో మాస్ కాపీయింగ్ చోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిడుతూరు జెడ్పీ పాఠశాలలో రెగ్యూలర్ 153 మంది, 78 మంది ప్రైవేటు విద్యార్థులు, ఏపీ ఆదర్శ పాఠశాలలో రెగ్యూలర్ 178 మంది, 94 మంది ప్రైవేటు విద్యార్థులు, కడుమూరు జెడ్పీ పాఠశాలలో రెగ్యూలర్ 138 మంది విద్యార్థులు, 96 మంది ప్రైవేటు విద్యార్థులు రాస్తున్నారని చెప్పారు.

ఆత్మకూరులో 7 పరీక్ష కేంద్రాలు

ఆత్మకూరు: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ జానకిరాం తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 270, చైతన్య హై స్కూలులో 246, పద్మావతి హైస్కూలు 207, ఉర్దూ పాఠశాల 226, బాలికల పాఠశాల 240, గౌతమి హై స్కూలు 227, డిపాల్ హై స్కూలులో 300 మంది చొప్పున విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు.